సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం । 24 । నవంబర్ । 2023



సుగంధ ద్రవ్యాలసాగుతో లాభాలు

సుగంధ ద్రవ్యాల పంటల సాగు చేస్తే అధిక లాభాలు వస్తాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నందు తెలిపారు. 8లో



బాలలతో పనిచేయిస్తే కేసులు

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందరూ కృషి చేయాలని జిల్లా కార్మికశాఖ ఇన్‌చార్జి టి.సుజాత కోరారు. 8లో



ఘనంగా ఏకాదశి పూజలు

సాక్షి,పాడేరు: జిల్లాలో ఏకాదశి పూజలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఉసిరి చెట్టు వద్ద దీపారాధన చేశారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్ టీఎఫ్ గౌరవ సలహాదారుడిగా త్రినాథరావు



అరకులోయటౌన్: వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ సలహాదారుడిగా అరకు ఎంఈవో-1 వంతల త్రినాథరావు నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్ రెడ్డి, కార్యదర్శి సు.దీర్ నియామకాన్ని ప్రకటించారు. గెజిటెడ్ అధికారి హోదా గల వంతల త్రినాథరావు సేవలను సంఘం అభివృద్ధికి ఉపయోగించుకుంటామని వైఎస్సార్ టీఎఫ్ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షులు చొక్కాకుల సూర్యనారాయణ తెలిపారు. గురువారం ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డిని కలసి సంఘం బలోపేతంపై తీసుకుంటున్న చర్యలపై వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీని సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు.

జిల్లాకు బదిలీపై 106 మంది పోలీసు సిబ్బంది రాక



బదిలీపై వచ్చిన సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

పాడేరు రూరల్ : జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లలో ఉన్న ఖాళీలను పూర్తి స్థాయిలో భర్తీ చేసినట్టు ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లాకు 106 మంది బదిలీపై వచ్చారు. వీరిలో 13 మంది ఏఎస్‌ఐలు కాగా, 51 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 42 కానిస్టేబుళ్లు ఉన్నారు. వీరందరికీ జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లను గురువారం ఎస్పీ కేటాయించారు. బదిలీపై వచ్చిన వారికి అదనపు ఎస్పీ(అడ్మిన్) అనిల్ పులిపాటి, డీఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ఎల్.హిమగిరి, జిల్లా పోలీస్ కార్యాలయం ఏఏవో తిలక్‌తో పాటు ఎస్పీ పోస్టింగ్ ఆర్డర్లను అందజేశారు.

నేటి స్పందన రద్దు

సాక్షి,పాడేరు: జిల్లా కేంద్రం పాడేరులో ఈనెల 24న జరగవలసిన స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు కలెక్టర్ సుమిత్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కొన్ని పరిపాలన కారణాల వల్ల రద్దు చేశామని, జిల్లా ప్రజలు గమనించాలని కలెక్టర్ కోరారు.

రెగ్యులేటర్ డ్యామ్ గేట్లకు మరమ్మతులు



పనులు పరిశీలిస్తున్న జెన్‌కో అధికారులు

సీలేరు: ఏపీ జెన్‌కో సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తికి నీటిని సరఫరా చేసే రెగ్యులేటర్ డ్యామ్ గేట్లకు మరమ్మతులు చేపట్టారు. గేట్లు సక్రమంగా పనిచేయకపోవడం వల్ల తరచూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నీరు వృథాగా పోతోంది. దీన్ని అరికట్టేందుకు జెన్‌కో సివిల్ అధికారులు మూడు గేట్లకు పూర్తి స్థాయిలో బుధవారం నుంచి మరమ్మతులు చేపట్టారు. గేట్ల రోలర్స్, రోపు వైర్లు తొలగించి కొత్తవి వేయనున్నారు. ఈ పనులను జెన్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ప్రభాకర్, ఏఈఈ సురేష్ పరిశీలించారు. త్వరగా పూర్తి చేయాలని, నాణ్యతగా చేపట్టాలని సూచించారు.

చెట్ల దుంగల తరలింపు



కలప తరలింపును పరిశీలిస్తున్న సబ్ డీఎఫ్‌వో, రేంజర్

కొయ్యూరు: చింతాలమ్మ ఘాట్‌రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించిన చెట్ల దుంగల తరలింపును గురువారం ప్రారంభించారు. ఆర్వీ నగర్, మర్రిపాకల, సీలేరు రేంజ్‌లకు చెందిన సబ్ డీఎఫ్‌వో ఎస్.ఎస్.బి.రాజు, పెదవలస రేంజర్ జగదీష్‌తో కలిసి తరలింపును పరిశీలించారు. జాతీయ రహదారి 516/ఈ నిర్మాణంలో భాగంగా మొత్తం 640 చెట్లను తొలగించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఎలాంటిలోటుపాట్లు లేకుండా దుంగలను డిపోకు తరలించాలని ఆదేశించారు. సిబ్బంది దుర్గప్రసాద్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు ఆరోగ్య భద్రత

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. ఆటలాడేటప్పుడు తగిలే గాయాలు, కొద్దిపాటి జలుబు, ఇతర చిన్నచిన్న ఆరోగ్య సమస్యలకు ప్రథమ చికిత్స అందించేందుకు కేంద్రాలకు మెడికల్ కిట్లు అందజేసింది.

- తక్షణ, ప్రాథమిక చికిత్సకు ఔషధ కిట్లు సరఫరా
- పిల్లల ఆరోగ్యంపై ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తల పర్యవేక్షణ



అరకులోయ మినీ అంగన్‌వాడీ కేంద్రానికి అందజేసిన మందులు

అరకులోయ టౌన్ : అంగన్‌వాడీ కేంద్రాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాల మెరుగుకు చర్యలు చేపట్టారు. సొంత భవనాలతోపాటు, ఆంగ్ల మాధ్యమంలో బోధన, ఆటపాటలతో చిన్నారుల సర్వతోముఖాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటునందిస్తోంది. మాతాశిశు సంక్షేమానికి భారీగా నిధులు ఇవ్వడం ద్వారా కొత్త విధానాలతో అంగన్‌వాడీ కేంద్రాలను విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతోంది. దీనిలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు, పిల్లలు అనారోగ్యం బారిన పడినపుడు, చిన్నారులు ప్రమాదవశాత్తు గాయపడినపుడు వారికి అత్యవసర ప్రథమ చికిత్స అందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలన్నింటికీ ప్రత్యేకంగా మెడికల్ కిట్లు అందజేస్తోంది. జిల్లాలోని 3,214 అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రాథమిక చికిత్స కిట్లను విశాఖపట్నం సెంట్రల్ ఫార్మసీ నుంచి సరఫరా చేస్తున్నారు. ఈనెల 20 తేదీ నుంచి సరఫరా ప్రారంభించారు. జిల్లాలో ఇప్పటి వరకు కొయ్యూరు మండలంలోని 160 అంగన్‌వాడీలకు మందుల కిట్లు సరఫరా చేశారు. ప్రతి సంవత్సరం నవంబర్, డిసెంబర్ నెలల్లో ఈ కిట్లను అందజేసి, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో విద్యనభ్యసిస్తున్న చిన్నారులకు భద్రత కల్పిస్తున్నారు. చిన్నారులు జ్వరం బారిన పడినా, ప్రమాదాలకు గురైనా వెంటనే వైద్యం అందించేలా కిట్లలో మందులను సమకూర్చారు. వీటిలో ఫస్ట్‌ఎయిడ్‌కు వినియోగించే ఔషధాలకు ప్రాధాన్యతనిచ్చారు. పారాసిటమాల్ సిరప్, ఐరన్ ట్యాబ్లెట్లు, సిల్వర్ సల్ఫాడైజిన్, క్లోరో ఫినరామిన్ మాలియాట్, ఫురాజోలిడిన్, హ్యాండ్ శానిటైజర్, రోలల్ బేండేజ్, నియోమైసిన్ ఆయింట్ మెంట్, కాటన్, సిప్రోఫ్లాక్సిన్ చుక్కల మందు, బెంజయిల్, బెంజోయేట్, మరికొన్ని సిరప్‌లు కిట్లలో ఉన్నాయి. పిల్లలలో వచ్చే సాధారణ వ్యాధులు, ఏఏ మందులను ఎంతెంత మోతాదులో ఎలా వినియోగించాలో పేర్కొంటూ సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం పేరుతో తెలుగులో సమాచారాన్ని కూడా స్పష్టంగా పంపించారు. మందుల వినియోగంపై వైద్య సిబ్బందితో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులకు అవగాహన కల్పించారు.



బోసుబెడ అంగన్‌వాడీ కేంద్రంలో బాలుడికి చికిత్స చేస్తున్న డాక్టర్

ఏఎన్‌ఎం, ఆశాకార్యకర్తల పర్యవేక్షణ

ప్రతి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయా కేంద్రాల పరిధిలో సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ప్రతి మూడు నుంచి నాలుగు రోజులకొకసారి పర్యవేక్షణ చేయాల్సి ఉంది. వీరు కేంద్రాల్లోని చిన్నారులకు పెరుగుదల, బరువుపై పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి మందులు అందించాలి. ఆయా కేంద్రాల్లో మెడికల్ కిట్లలో ఉన్న మందులు, ఇతర సామగ్రిని అవసరమైన వారికి అందిస్తారు. కేంద్రాల్లోని చిన్నారులతోపాటు రక్తహీనతతో బాధపడుతున్న మహిళలు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యాన్ని పరిరక్షిస్తారు.

జిల్లాలో వివరాలు

జిల్లాలో మొత్తం ఐసీడీఎస్ ప్రాజెక్టులు	:	19
మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు	:	3,214
మెయిన్ కేంద్రాలు	:	1,791
మినీ కేంద్రాలు	:	1,423
గర్భిణులు	:	9,816
బాలింతలు	:	10,728
6 నెలల నుంచి ఏడాది లోపు చిన్నారులు	:	13, 675
ఏడాది నుంచి మూడేళ్లలోపు పిల్లలు	:	37, 984
మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలు	:	43, 523

కిట్ల వల్ల చాలా ప్రయోజనం



అంగన్‌వాడీ కేంద్రాలకు మెడికల్ కిట్లు పంపిణీ చేస్తున్నాం. ఈ కిట్లలో నాణ్యమైన, నిత్యం వినియోగించే మందులున్నాయి. పిల్లలకు జ్వరం, చిన్నపాటి గాయాలు, ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తితే ఈ కిట్‌లోని మందులు ఉపయోగపడతాయి., పిల్లలల్లో సాధరణంగా వచ్చే చర్మ వ్యాధుల నిర్మూలనకు సంబంధించిన అయింట్‌మెంట్లు ఈ కిట్‌లో ఉంటాయి.

– సూర్యలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ

పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు ప్రతి మూడు రోజులకు ఒకసారి అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షిస్తారు. కేంద్రంలోని పిల్లల ఎదుగుదల, ఎత్తు, బరువు పరీక్షల నిర్వహణతోపాటు కిట్‌లోని మందులను అవసరమైన వారికి అందిస్తారు. ఫస్ట్ ఎయిడ్ కిట్‌లోని మందులపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పిస్తారు.

– డి.శారద, సీడీపీవో, అరకులోయ ఐసీడీఎస్ ప్రాజెక్టు

రూ. 2.40 కోట్లతో పోలీసు స్టేషన్‌లకు భవనాలు

- రంపచోడవరం ఓఎస్‌డీ మహేశ్వరరెడ్డి



శంకుస్థాపన చేస్తున్న ఓఎస్‌డీ మహేశ్వరరెడ్డి

మోతుగూడెం: రంపచోడవరం డివిజన్ పరిధిలో ఎటపాక, చింతూరు, మోతుగూడెం పోలీసుస్టేషన్లకు కొత్త భవనాలు నిర్మిస్తున్నట్టు రంపచోడవరం ఓఎస్‌డీ మహేశ్వర్ రెడ్డి తెలిపారు. చింతూరు మండలం మోతుగూడెంలో గురువారం పోలీసు స్టేషన్ నూతన భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుమారు రూ.2.40 కోట్ల వ్యయంతో నూతన భవనాలను నిర్మిస్తున్నట్టు చెప్పారు. అనంతరం స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. ఓఎస్‌డీ వెంట చింతూరు సీఐ అప్పలనాయుడు, ఏఎస్ఐ పట్టాభి ఉన్నారు.

గండి పోశమ్మ ఆలయంలోకి ఎవరినీ అనుమతించొద్దు



గండిపోశమ్మ ఆలయం వద్ద పరిస్థితిని సమీక్షిస్తున్న ఏఎస్పీ జగదీష్ అడహళ్లి

రంపచోడవరం: గండిపోశమ్మ అమ్మవారి ఆలయం ఇంకా గోదావరి నది ముంపులో ఉన్నందున ఎవరినీ గుడిలోకి అనుమతించవద్దని రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ ఆడహళ్లి ఆదేశించారు. రంపచోడవరం సీఐ సురేష్ బాబుతో కలిసి ఆయన గురువారం గండిపోశమ్మ ఆలయాన్ని, పాపికొండలు టూరిజం బోటింగ్ పాయింట్‌ను సందర్శించారు. ప్రస్తుత వరద పరిస్థితి, పాపికొండల పర్యాటక బోటింగ్ పాయింట్ పరిస్థితిని సమీక్షించారు. అమ్మవారి ఆలయంలోకి కొన్ని రోజుల పాటు ఎవరినీ అనుమతించ వద్దని ఆదేశించారు.

సమయపాలన పాటించకపోతే.. జీతాలు కట్

కలెక్టర్ సుమిత్‌కుమార్



వీడియో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలోని అన్ని గ్రామ సచివాలయాల్లో అన్ని విభాగాల ఉద్యోగులు సమయానికి సచివాలయాలకు హాజరుకావాలని లేని, పక్షంలో జీతాలు కట్ చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి ఎంపీడీవోలు, ఉపాధి హామీ పథకం అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉపాధి హమీ పనులు, సచివాలయం ఉద్యోగుల హాజరు, జనన ధ్రువీకరణ పత్రాల జారీ, ఆధార్ శిబిరాల నిర్వహణ, ఆస్తిపన్నుల వసూలుపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా పంచాయతీ అధికారి, డీఎల్‌డీవోలు గ్రామసచివాలయాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. వీఆర్వోలు సక్రమంగా విధులకు హాజరుకాకపోయినా, క్షేత్రస్థాయి పర్యటనలో లేకపోయినా జీతాలు నిలిపివేయాలని ఆదేశించారు. ఎనర్జీ అసిస్టెంట్లు విధిగా సచివాలయాలకు హాజరుకావాలని తెలిపారు. ప్రతి మండలంలోని రోజుకు ఐదు వేల మందికి ఉపాధి పనులు కల్పించాలని తెలిపారు. అన్ని మండలాల ఏపీవోలు తమ లక్ష్యాలను సాధించాలన్నారు. ఏపీవోల పనితీరు మెరుగుపడాలని, ఎక్కడ లోపాలు ఉన్నా ఉపేక్షించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. ఉపాధి కూలీల ఆధార్ సీడింగ్‌తో పాటు తొలగించిన జాబ్‌కార్డులను పునరుద్ధరించాలని, నీరు, భూముల సంరక్షణకు సంబంధించిన పనులు అధికంగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు, డీఎల్‌డీవో శాంతకుమారి, డీఎల్‌పీవో కుమార్, ఉపాధి హామీ పథకం డీబీటీ మేనేజర్ నరేష్,ఏపీడీ జవ్వాది గిరిబాబు పాల్గొన్నారు.

అరకు-లంబసింగి అందాలపై

ట్యాగ్‌లైన్, లోగో పోటీలు

కలెక్టర్ సుమిత్‌కుమార్



ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, స్వదేశ్ దర్శన్ ప్రాజెక్ట్ కన్సల్టెంట్ హరిహరకుమార్

సాక్షి,పాడేరు: అరకు-లంబసింగి గిరిజన సంస్కృతి వారసత్వం, అద్భుతమైన ప్రకృతి దృశ్యాలు జిల్లాకే గర్వకారణమని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. అరకు, లంబసింగి అందాలకు సంబంధించి ఏపీ పర్యాటకశాఖ ట్యాగ్‌లైన్, లోగో, ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ పోటీల ప్రచార పోస్టర్‌ను కలెక్టర్ గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటకులను ఆకర్శించే విధంగా అరకు-లంబసింగి అందం, సాంస్కృతిక వారసత్వం, సాధర ఆతిథ్యం, సహజత్వం ప్రతిబింబించే లోగో, ట్యాగ్‌లైన్‌ను రూపొందించాలని తెలిపారు. పోటీలో పాల్గొనే వారు ఒక ట్యాగ్‌లైన్ మాత్రమే సమర్పించాలని, లోగో డిజైన్‌లన్నీ హై రిజల్యూషన్ డిజిటల్ ఫార్మేట్‌లో ఉండాలని, ట్యాగ్ లైన్‌లను టెక్స్ డాక్యుమెంట్ లేదా పీడీఎఫ్‌లో exp lorearakulambasingi@gmail.comఅనే అడ్రస్‌కు వచ్చేనెల 25వతేదీ లోగా పంపాలని చెప్పారు. ఈపోటీలో పాల్గొనేందుకు జిల్లా వాసులే ఎటువంటి రుసం చెల్లించవలసిన అవసరం లేదని, ఇతర జిల్లాలకు చెందిన వారు చైర్మన్, జిల్లా పర్యాటక మండలి పేరిట గల 329202010047969 అకౌంట్‌కు రూ.500 ఫీజు చెల్లించాలని ఆయన సూచించారు. విజేతకు రూ.25వేలు నగదు బహుమతి, మరో ముగ్గురుకి ప్రశంసా పత్రాలు అందజేస్తామని చెప్పారు.

ఫొటోగ్రఫీ పోటీల వివరాలు

ఔత్సాహిక, ప్రొఫెసనల్ ఫొటోగ్రాఫర్‌లు పాల్గొని విభిన్న అంశాలలో ఫొటోలు ప్రదర్శించవచ్చన్నారు. వన్యప్రాణులు-ప్రకృతి, వ్యక్తులు, సంస్కృతి, జీవనశైలి, ట్రావెలర్ లెన్స్ ద్వారా అరకు, లంబసింగి గమ్యస్థానం గుండా వారి ప్రయాణం వంటి అంశాలపై ఫొటోగ్రఫీ పోటీలు ఉంటాయన్నారు. డిజిటల్ ఫార్మేట్‌లో 10 ఎంబీకి మించకుండా ఫొటోలు పై మెయిల్ అడ్రస్‌కు 2024 జనవరి 24వతేదీ లోగా మెయిల్ చేయాలన్నారు. ఈ పోటీలకు కూడా జిల్లా వాసులు రుసుం చెల్లించవలసిన అవసరం లేదని, ఇతర జిల్లాల ఫొటోగ్రాఫర్లు రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించాలన్నారు. ఈ పోటీలో మొదటి బహుమతిగా రూ.25వేలు, రెండవ బహుమతి రూ.15వేలు, మూడవ బహుమతి రూ.10 వేలు, తదుపరి 10మందికి ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్టు కలెక్టర్ కలెక్టర్ తెలిపారు. మరిన్ని వివరాలకు ఐటీడీఏ టూరిజం వెబ్ సైట్‌ను సందర్శించాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో స్వదేశ్ దర్శన్ 2.0 కన్సల్టెంట్ డి.హరిహరకుమార్ పాల్గొన్నారు.

'జోష్' నింపిన సూర్య



సెంచరీతో చెలరేగిన జోష్ ఇంగ్లిస్



సూర్యకుమార్ యాదవ్ బ్యాటింగ్ మెరుపులు

విశాఖ తీరాన అభిమాన తరంగం టీ 20 మ్యాచ్ సందర్భంగా హోరెత్తింది. ఆ ఉరవళ్లు ఈ కార్తీకాన సందడి చేశాయి. డియర్ టీం ఇండియా.. మేమంతా మీ వెంటే.. మళ్లీ చెబుతున్నాం అభిమాన సంద్రం ఎన్నడూ చిన్నబోదు.. అని స్పష్టం చేసింది. నరాలు తెగే ఉత్కంఠ మ్యాచ్‌లో మన కుర్రాళ్లు కుమ్మేశారు. అటు ఆసీస్.. ఇటు భారత్ ఆటగాళ్లు పరుగుల వరద పారించడంతో క్రికెట్ అభిమానులు పండగ చేసుకున్నారు. ఆసీస్ బ్యాటర్ జోష్ ఇంగ్లిస్ కేవలం 60 బంతుల్లో మెరుపు సెంచరీ చేయగా.. అందుకు దీటుగా భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. 42 బంతుల్లో 80 పరుగులు చేసి ఇండియా విజయానికి బాటలు వేశాడు. ఇండియా-ఆస్ట్రేలియా టీ-20 సిరీస్‌లో తొలి మ్యాచ్ విశాఖ క్రీడాభిమానులకు మంచి కిక్ ఇచ్చింది.

– విశాఖ స్పోర్ట్స్

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు మేలు



పట్టాలు పంపిణీ చేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ట్రైకార్ చైర్మన్ బుల్లిబాబు

సాక్షి,పాడేరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గిరిజన రైతులకు ఎంతో మేలు జరిగిందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక కాఫీ అతిథి గృహంలో 54 మంది గిరిజన రైతులకు 30 ఎకరాలకు సంబంధించి అటవీ, డిఫారం పట్టాలను గురువారం ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్వోఎఫ్ఆర్, డి.ఫారం పట్టాలు పొందిన గిరిజన రైతులకు కూడా రైతు భరోసా ఆర్థికసాయం అందడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వం అమలుజేస్తున్న సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల పేద ప్రజలకు లబ్ధిజరిగిందని, వైఎస్సార్‌సీపీ చేస్తున్న మంచిని గుర్తించి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, ఎంపీపీ సొనారి రత్నకుమారి, వైస్ ఎంపీపీ కుంతూరు కనకాలమ్మ, పాడేరు మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, డైరెక్టర్ లకే రామసత్యవతి, గబ్బాడి రాజారావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షురాలు ఎం.సరస్వతి, సభ్యుడు మినుముల కన్నాపాత్రుడు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, జిల్లా ప్రధానకార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, సర్పంచ్‌లు గబ్బాడ చిట్టిబాబు, కె.సన్నిబాబు, జి.నీలకంఠం, ఎం.మీనా, లకే పార్వతి, బి.చిట్టిబాబు, వి.బసవన్నదొర, ఎంపీటీసీలు లకే రామకృష్ణపాత్రుడు, కుంతూరు నరసింహమూర్తి, మాజీ ఎంపీపీ ఎస్.వి.వి.రమణమూర్తి, సీనియర్ నాయకులు మోదబాబురావు, పసుపుల సత్యనారాయణ, సుదర్శన్, లింగమూర్తి, ఐశ్వర్యరాణి పాల్గొన్నారు.

177 మందికి కళ్యాణమస్తు

తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ.1.76 కోట్లు జమ



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు

సాక్షి, పాడేరు: వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా కింద జిల్లాలో 177 మందికి రూ.1.76 కోట్లు మంజూరైంది. జులై నుంచి సెప్టెంబర్ వరకు మూడు నెలల్లో వివాహం చేసుకున్న వారికి ఈ ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి వధువుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో ఈ ఆర్థికసాయం జమ చేశారు. ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, లబ్ధిదారులు వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 177 మంది దంపతులకు రూ.1,76,30,000 ఆర్థికసాయాన్ని ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఎస్టీలు 162 మంది, ఎస్సీలు నలుగురు, బీసీ-ఏ ఇద్దరు, బీసీ-బి ఐదుగురు, బీసీ డి నలుగురు బ్యాంకు ఖాతాల్లో నగదు జమచేసినట్టు చెప్పారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పేదవర్గాల ఆడపిల్లలకు వివాహాలకు కోసం అందజేస్తున్న ఆర్థిక సాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబులు నమూనా చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ వి.మురళీ, వెలుగు ఏపీఎంలు పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణ పద్ధతులపై అవగాహన కల్పించాలి

చింతపల్లిరూరల్: కుటుంబ నియంత్రణ పద్ధతులపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జి.జనార్దన్ అన్నారు. మండలంలో లోతుగెడ్డ పీహెచ్‌సీని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న మందులను పరిశీలించి, రికార్డులు తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకుని, సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు పీహెచ్‌సీలో చేసేందుకు చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. లోతుగెడ్డ వైద్యాధికారి లక్ష్మీకాంత్ స్పందిస్తూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డిసెంబర్ 1 వ తేదీన లోతుగెడ్డ పీహెచ్‌సీ పరిధిలో వేసక్టమీ ఆపరేషన్లు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి సింహాద్రి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

కేకే లైన్లో డీఆర్ఎం తనిఖీలు



కరకవలస స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం : వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ గురువారం కేకే లైన్లో తనిఖీలు చేపట్టారు. ఈ పరిధిలోని పలు స్టేషన్‌లలో ఆయన తనిఖీలు నిర్వహించి వాస్తవ పరిస్థితులను తెలుసుకున్నారు. స్టేషన్‌లో సదుపాయాలు, ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ మార్గంలో జరుగుతున్న డబ్లింగ్ పనులను పరిశీలించారు. ఈ తనిఖీలలో భద్రత, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ప్రయాణికుల సదుపాయాలు స్వయంగా పరిశీలించి, పలు సూచనలు చేశారు. శివలింగపురం స్టేషన్‌లో సదుపాయాలు, త్యాడ స్టేషన్‌లో ఆధునికీకరిస్తున్న స్టేషన్ భవనం, ట్రాక్షన్, సబ్ స్టేషన్, యార్డ్ ప్లానింగ్‌లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం బొర్రాగుహలు, కరకవలస, సిమిలిగుడ స్టేషన్‌లలో కూడా తనిఖీలు చేశారు. ఈ తనిఖీలలో ఆయనతో పాటు చీఫ్ ఇంజనీర్,కన్‌స్ట్రక్షన్ కె.ధనుంజయరావు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

మూడు ట్రాక్టర్ బ్యాటరీల చోరీ

ఎటపాక: మండలంలో ఇటీవల కాలంలో చోరీలు ఎక్కువవుతున్నాయి. ఈ క్రమంలో తోటపల్లిలో బుధవారం రాత్రి రైతులకు చెందిన మూడు ట్రాక్టర్ బ్యాటరీలు చోరీకి గురయ్యాయి. రాత్రి సమయంలో ఇంటి ముందు నిలిపి ఉంచిన ట్రాక్టర్లను టార్గెట్ చేసుకుని చోరీలకు పాల్పడటంతో రైతులు లబోదిబోమని గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికే పలు గ్రామాల పొలాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి అందులోని కాపర్ వైర్‌ను దొంగిలిస్తున్నారు. అదేవిధంగా ఆలయాల్లోని హుండీలు, కల్లాల్లో పశువులను మాయం చేస్తున్నారు. వీటిపై ఫిర్యాదులు చేసినా పోలీసులు పట్టించుకోవట్లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పంటలు నష్టపోయిన రైతులను చోరీలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

ఇంటింటా సంక్షేమ ఫలాలు

హుకుంపేట: సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతీ ఒక్కరికి అందడంతో గిరిజన గ్రామాల్లో ఇంటింటా పండగ వాతావరణం కనిపిస్తుందని, గిరిజన గ్రామల్లో అందరి నోట జగనన్న రావాలి అన్న మాటే వినబడుతుందని అరుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. పల్లెకు పోదం, ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమంలో భాగంగా మండలంలోని పాతకోట పంచాయతీ కేంద్రంతో పాటు పనసపుట్టు, చింతలవీధి, సోడా గ్రామాల్లో ఆయన స్థానిక నాయకులతో కలిసి పర్యటించారు. ఈ నేపథ్యంలో సచివాలయ కేంద్రంలో సంక్షేమ పథకాల బోర్డు, పనసపుట్టులో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గ్రామల్లో గిరిజనులకు పథకాలు అందించడమే కాకుండా గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతుండడంతో గిరిజనులు సంతోషంగా ఉన్నారన్నారు. జెడ్పీటీసీ మత్స్యలింగం, మండల పార్టీ అధ్యక్షుడు కొండబాబు, జేసీయస్ మండల ఇన్‌చార్జి రామకృష్ణ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సింహాచలం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ కొండలరావు, సర్పంచ్‌లు లక్ష్మి, బొంజుబాబు, బేసు, నాయకులు చిన్నబ్బి, చిన్నయ్య, బాలన్న, కో-కన్వీనర్ కోటిబాబు, రాజారావు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా జగనన్న పాలన

రాజవొమ్మంగి:ప్రజల ఆకాంక్షలు, ఆశయాలకు అనుగుణంగానే జగనన్న పాలన సాగుతోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ అన్నారు. మండలంలోని వాతంగిలో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో 200 గడపలను సందర్శించారు. సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. వాతంగిలో రూ. 21.5 లక్షల వ్యయంతో నిర్మించిన ఆర్బీకే, రూ.62.5 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని వారు ప్రారంభించారు.



పాతకోటలో గ్రామస్తులకు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, చిత్రంలో జెడ్పీటీసీ మత్స్యలింగం



లోదొడ్డిలో రోడ్డు నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు తదితరులు

వాతంగికి సుమారు 10 కిలోమీటర్ల దూరంలోని లోదొడ్డి వెళ్లి కోటి రూపాయల అంచనా వ్యయంతో లోదొడ్డి నుంచి పాకవెల్లి వరకు నిర్మించనున్న రోడ్డు పనులకు భూమి పూజ చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించి పనులు ప్రారంభించారు. ఒక నెలలోగానే ఈ రోడ్ పూర్తి చేస్తున్నట్లు ప్రజలకు వివరించారు. అనంతరం లోదొడ్డి గ్రామంలో గత ఏడాది ఫిబ్రవరి 2న కల్తీ జీలుకల్లు తాగి మరణించిన ఐదు బాధిత కుటుంబాలకు రూ.15లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు అందజేశారు. రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి వాతంగిలో అశేష అభిమానుల మధ్య తమ పుట్టినరోజు వేడుకను జరుపుకొన్నారు. గ్రామస్తులు ఆమెను పూలమాలలతో, పుష్పగుచ్ఛాలతో సత్కరించి, కేక్ కట్ చేయించారు. వాతంగి సచివాలయం వద్ద కాసేపు సందడి వాతావరణం నెలకొంది. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ జుర్రా రాజేశ్వరి, సర్పంచ్ భీంరెడ్డి శుభలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ, నాయకులు దాట్ల వెంకటేశ్వరాజు, కొంగర మురళీకృష్ణ, జుర్రా జాన్‌బాబు, అర్జున్, అడపా కామేష్, సర్పంచ్‌లు మిరియాల గణలక్ష్మి, సత్యవతి, తహసీల్దార్ సుబ్రహ్మణ్యాచారి, గిరిజన సంక్షేమశాఖ డీఈ గౌతమి, ఏఈ వీరభద్రరావు, సీడీపీఓ దేవమణి, సీఐ బాజిలాల్, ఎస్సీ. హెచ్‌సీ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

సుగంధ ద్రవ్యాల సాగుతో లాభాలు

పాడేరు రూరల్ : సుగంధ ద్రవ్యాల పంటల సాగుకు మన్యం వాతవరణం ఎంతో అనుకూలమని, వాటిని సాగు చేస్తే అధిక లాభాలు ఆర్జించవచ్చని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.బి.ఎస్. నందు స్పష్టం చేశారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు స్పైసెస్ బోర్డు ఆధ్వర్యంలో గురువారం గిరిజన్ భవన్‌లో రైతులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ పద్ధతులు, సాంకేతిక పద్ధతులు, సుగంధ ద్రవ్యాల నాణ్యత మెరుగుపరిచే పద్ధతులు, గ్రేడింగ్, క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. స్పైసెస్ బోర్డు సీనియర్ ఫీల్డ్ ఆఫీసర్ బి.కళ్యాణి, చింతపల్లి ఉద్యాన పరిశోధన కేంద్రం సైంటిస్ట్ డాక్టర్ వి.శివకుమార్, డీఏఏటీసీ సైంటిస్ట్ డాక్టర్ వెంకటరావు, వ్యవసాయ, ఉద్యానవన శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బాలలతో పనిచేయిస్తే కేసులు

హుకుంపేట: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందరూ కృషి చేయాలని జిల్లా కార్మికశాఖ ఇన్‌చార్జి టి.సుజత కోరారు. మండల కేంద్రంలో గురువారం ఆమె పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి, బాలుడితో పనిచేయిస్తున్న ఓ దుకాణదారునిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలకార్మికుల గుర్తింపు, పునరావసంలో భాగంగా ఈ నెల 20వ తేదీ నుంచి వచ్చేనెల 10వరకు తనిఖీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. బాలలతో పనులు చేయిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజార్ అసీన, హెడ్‌కానిస్టేబుల్ జలంధర్ పాల్గొన్నారు.

45 అంగన్‌వాడీ భవనాలకు మరమ్మతులు

ముంచంగిపుట్టు: అంగన్‌వాడీ కేంద్రాల భవనాలకు పిల్లల తల్లుల పర్యవేక్షణలో మరమ్మతులు చేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశించారు. మండల కేంద్రంలో స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో గురువారం నాడు నేడు పనులపై సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, పిల్లల తల్లులతో సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో పీడీ సూర్యలక్ష్మి మాట్లాడుతూ మండలంలో 45 అంగన్‌వాడీ కేంద్రాల్లో నాడు-నేడు ఫేజ్ 2-బి ద్వారా మరమ్మతులు చేయడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్టు చెప్పారు. ప్రజల భాగస్వామ్యంతో కమిటీల ద్వారా పనులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవోలు వరహాలమ్మ, సంతోషి, ఎంపీడీవో కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ముంచంగిపుట్టులో మాట్లాడుతున్న పీడీ సూర్యలక్ష్మి

పెదబయలు: అంగన్‌వాడీ కేంద్రాల్లో రెండో దశలో మంజూరైన నాడు నేడు పనులపై స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పీడీ సూర్యలక్ష్మి మాట్లాడుతూ 28 భవనాలకు మరమ్మతులు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో రాజేశ్వరి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలన అందరి బాధ్యత

పాడేరు రూరల్ : జిల్లాలో గంజాయి సాగు, రవాణా నిర్మూలన అందరి బాధ్యత అని ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. గురువారం విశాఖ రేంజ్ డీఐజీ హరికృష్ణతో కలిసి ఎస్పీ తుహిన్ సిన్హా జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన సర్పంచ్‌లతో స్థానిక పోలీస్ స్టేషన్ల ద్వారా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గిరిజన గ్రామాల్లో గంజాయి సాగును శాశ్వతంగా నిర్మూలించేందుకు సర్పంచ్‌లు పోలీసులకు సహకారం అందించాలని సూచించారు. గంజాయి సాగు, రవాణా, అమ్మకాల సమాచారాన్ని జిల్లా కేంద్రమైన పాడేరులో ఏర్పాటు చేసిన ఎన్డీపీఎస్ సెల్ నంబర్ 9381123100 ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. గంజాయి సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న తుహిన్ సిన్హా

గంజాయి రహిత జిల్లాగా మార్చాలి

హుకుంపేట: జిల్లాను గంజాయి రహితంగా మార్చడానికి సర్పంచ్‌లు సహకరించాలని డీఐజీ హరి కృష్ణ కోరారు. గురువారం సర్పంచ్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా సాగు చేస్తున్నా, రవాణా చేస్తున్నా ఆ సమాచారాన్ని పోలీసులకు అందజేయాలని తెలిపారు.

రాములోరి అక్షింతలతో ఘనంగా శోభాయాత్ర



శోభాయత్రలో పాల్గొన్న భక్తులు

మారేడుమిల్లి : అయోధ్య రాములవారి నుంచి వచ్చిన అక్షింతలతో మారేడుమిల్లిలో భక్తులు ఘనంగా శోభాయాత్ర నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రామనామ స్మరణంతో గ్రామం మార్మోగింది.

రైతులకు అండగా ప్రభుత్వం

పెదబయలు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో సంక్షేమ పథకాలన్నీ రైతుల చెంతకే వచ్చి చెరుతున్నాయని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. సీకరి పంచాయతీ కేంద్రంలో గురువారం నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అండగా నిలిచి అనేక సంక్షమ పథకాలు అమలుచేస్తోందన్నారు. రైతులకు అన్ని రకాల రాయితీలు, ఆర్థిక సహాయం మన ప్రభుత్వంలో అందుతున్నాయన్నారు. ఎంపీపీ వరహాలమ్మ ,జెడ్పీటీసీ బొంజుబాబు, రాష్ట్ర కార్యదర్శి సూర్యనారాయణ, ఎంపీడీవో విగ్గిన్స్, తహసీల్దార్ కృష్ణారావు, వైస్ ఎంపీపీ రాజబాబు, ఏవో శ్రీనివాస్, సర్పంచ్ కృష్ణారావు, ఎంపీటీసీ ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.



సికరి ఆర్‌బీకేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

36 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక



పనసపుట్టులో గిరిజనులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పాల్గుణ, చిత్రంలో జెడ్పీటీసీ మత్స్యలింగం

హుకుంపేట: మండలంలోని పాతకోట పంచాయతీ కేంద్రంతో పాటు పనసపుట్టు, చింతలవీధి, సోడా గ్రామాల్లో టీడీపీకి చెందిన 36 కుటుంబాల వారు గురువారం ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. కొండలరావు, తాతారావు, భీమన్న, సుమలత, అమ్మాజీ, కాసులమ్మ, శాంతమ్మలతో పాటు పలువురికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన గిరిజనులు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, తమకు అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై చేరినట్టు చెప్పారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు దేశంలో ఎక్కడ జరగడం లేదన్నారు.

మెరుగైన వైద్య సేవలు

రంపచోడవరం: రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మి అన్నారు. ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులు, హెడ్ నర్సులకు అత్యవసర సమయంలో అందిచాల్సి అత్యవసర చికిత్సపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ వృత్తిపరంగా పరిజ్ఞానాన్ని మెరుగుపరుకోవడం ద్వారా మరింతా ఉత్సాహంగా పనిచేయవచ్చన్నారు. డాక్టర్ కిరణ్‌దుర్గాప్రసాద్ గుండెకు సంబంధించిన వివిధం అంశాలపై శిక్షణ ఇచ్చారు. గుండె పోటుతో వచ్చిన రోగులకు సరైన సమయంలో ప్రాథమిక చికిత్స అందించడం ద్వారా ప్రాణాలు నిలిపే పరిస్థితి ఉంటుందన్నారు. ఇటీవల రంపచోడవరం ఏరియా ఆస్పత్రిని సందర్శించి డీసీహెచ్ఎస్ డాక్టర్ కృష్ణారావు ఆస్పత్రిలో అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మి పనితీరు బాగుందన్నారు. గిరిజనులకు మెరుగైన వైద్యం అందుతుందన్నారు.



రోగులకు అందుతున్న సేవలను పరిశీలిస్తున్న డాక్టర్ లక్ష్మి

సీఎం జగన్ పాలనలోనే గిరి గ్రామాల అభివృద్ధి

- ఉమ్మడి విశాఖ జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర
- రూ.8.55 కోట్లతో జీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

ముంచంగిపుట్టు: సీఎం జగన్ పాలనలో గిరి గ్రామాలు అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయని ఉమ్మడి విశాఖ జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. మండలంలోని దోడిపుట్టు పంచాయతీ కేంద్రం నుంచి బీడిచంప గ్రామానికి రూ.3.20 కోట్లు, బుంగాపుట్టు పంచాయతీ కేంద్రం నుంచి పులిజాలమ్మ వరకు రూ.5.20 కోట్లు ,పనసపుట్టు పంచాయతీలో రూ.15 లక్షలతో చేపట్టిన రోడ్ల నిర్మాణానికి గురువారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మన్యంలో రహదారులు, కల్వర్టులు, వంతెనల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని, రవాణా వ్యవస్థ మెరుగుపడిందని చెప్పారు. గత ప్రభుత్వాలు హామీలతో కాలయాపన చేశాయని తెలిపారు. ప్రజల అవసరాలు గుర్తించడం, నెరవేర్చడం ఒక్క వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమవుతుందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గిరిజన గ్రామాలు అభివృద్ధిలో దూసుకుపోతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ రహదారులు మంజూరు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆయా గ్రామాలకు చైర్‌పర్సన్ సుభద్ర వాగులను దాటుకుంటూ వెళ్లారు. వైస్ ఎంపీపీ ఎస్.భాగ్యవతి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జున్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు, సర్పంచ్‌లు వసంత, నొబినా, రమేష్, నరసింగరావు, నీలకంఠం, గంగాధర్, భాగ్యవతి, ఎంపీటీసీ కమల పాల్గొన్నారు.



బీడిచంప రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

కుర్రాళ్లు SUPER HIT



కమాన్ ఇండియా



మేరా భారత్ మహాన్





మువ్వన్నెల దరహాసం

విశాఖను టీ-20 తుపాను కమ్మేసింది. బ్యాటర్లు వైఎస్సార్ స్టేడియంలో పరుగుల సునామీ సృష్టించారు. సిక్సర్లు, ఫోర్లతో శివతాండవం చేశారు. ముందుగా ఆస్ట్రేలియా బ్యాటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగి.. ఫోర్లు, సిక్సర్లతో భారత బౌలర్లపై విరుచుకుపడ్డారు. భారీ లక్ష్య ఛేదనకు బరిలోకి దిగిన భారత కుర్రాళ్లు అనుభవజ్ఞులున్న ఆస్ట్రేలియా జట్టును కంగారు పెట్టించారు. అచ్చొచ్చిన స్టేడియంలో అదరగొట్టారు. నరాలు తెగే ఉత్కంఠ మధ్య భారీ లక్ష్యాన్ని ఛేదించి శభాష్ అనిపించుకున్నారు. వరల్డ్ కప్ ఫైనల్‌లో ఓటమితో నిరాశలో ఉన్న అభిమానుల్లో ఈ విజయం జోష్ నింపింది. - విశాఖ స్పోర్ట్స్





నాడు టైలర్.. నేడు సినీ డైరెక్టర్

సాయి దర్శకత్వం వహించిన యమునా నది విడుదల నేడు



ఎస్.కె.సాయి

సాక్షి, పాడేరు: పాడేరు పట్టణంలోని సినిమాహాల్ సెంటర్ ప్రాంతంలో పదేళ్ల కిందట వరకు టైలరింగ్ చేసుకుని జీవించే టైలర్ ఎస్.కె.సాయి సినీ దర్శకుడుగా మారారు. పాడేరు మండలం గుత్తులపుట్టు గ్రామానికి చెందిన సాయి సినిమా దర్శకత్వం నేర్చుకోవాలని పదేళ్ల కిందట హైదరాబాద్ ఫిల్మ్‌నగర్‌కు వెళ్లిపోయాడు.అక్కడ పలు దర్శకుల వద్ద అసిస్టెంట్‌గా పనిచేశాడు.సొంతంగా సినిమా తీయాలనే ఆలోచనతో కొంతమంది స్నేహితుల సహకారంతో చిన్నబడ్జెట్‌తో యమునానది సినిమాకు శ్రీకారం చుట్టాడు. రోషన్‌బాలు బాగోటి, ఉర్మిజ అనే నూతన నటులతో గ్రామీణ ప్రేమకథ నేపథ్యంలో యమునానది సినిమా చిత్రీకరించారు. నిర్మాత, కథ, స్క్రీన్‌ప్లే,దర్శకత్వం బాధ్యతలన్ని ఎస్.కె.సాయి నిర్వర్తించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని బోడవరం, కోనాం, పాడేరు ప్రాంతాల్లో సినిమా షూటింగ్ జరిపారు. సినిమా ట్రైలర్‌ను ఇటీవల హైదరాబాద్‌లో విడుదల చేశారు.తన స్వగ్రామం పాడేరుపై ఉన్న అభిమానంతో దర్శకుడు ఎస్.కె. సాయి ఈ సినిమాను తొలిగా పాడేరు వెంకటరమణ థియేటర్‌లో శుక్రవారం విడుదల చేస్తున్నారు.



యమునానది చిత్ర పోస్టర్